గిరిజనుల అటవీ భూములకు సాగు పట్టాలు ఇవ్వాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్

విశాలాంధ్ర-బొబ్బిలి: మండలం గోపాల రాయుడుపేట పంచాయతీ నివాసముం టున్న గిరిజన గ్రామాలను పంచాయతీలో విలీనంచేసి, గిరిజన గ్రామాలకు త్రాగు నీరు, విద్యుత్తు, రహదారి సదుపాయం కల్పించాలని, దత్తిరేజేరు మండలాల్లో నివాసముంటు అటవీ భూముల్లో పోడు వ్యవసాయం చేసుకుంటూ అక్కడే నివాసం ఉన్న గిరిజనులకు వెంటనే సంబంధిత రెవిన్యూ అటవీశాఖ అధికారులు ప్రత్యేక సర్వే జరిపి అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగు పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని సోమవారం స్థానిక రెవిన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ మునకాల శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనుల లకు త్రాగునీరు విద్యుత్తు వైద్యము వంటి మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని , అటవీ భూముల్లో పోటి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం ఒక్కొక్క గిరిజనులకు 10 ఎకరాలు చొప్పున సాగు పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బొబ్బిలి మండల పరిధిలో ఉన్న సీయోను వలస, కృపావలస, దీవెన వలస, రామన్న వలస, చిన్న అక్కినవలస. సిహెచ్ బొడ్డవలస పంచాయతీ పరిధిలో గల మూల వలస చెల్లువలస, కొత్తమూలవలస, తదితర గిరిజన గ్రామాలకు, అలాగే దత్తిరాజేరు మండలంలో షికారు గంజి రెవెన్యూ అటవీ భూముల్లో నివాసం ఉన్నటువంటి ఎస్టీవలస, ఎస్టి కొత్తవలస గిరిజన గ్రామాలకు పోడుపట్టాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని అలాగే కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులపై అటవీ శాఖ అధికారులు అన్యాయంగా పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అటవీ, డి పట్టా భూములను లీజు పేరుతో దర్జాగా అనుభవిస్తున్న భూ కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదుచేసి పేదలకు పంపిణీచేయాలని డిమాండ్ చేశారు. పైసమస్యలపై పలు మార్లు స్థానిక ప్రజాప్రతినిధులకు సంబంధిత శాఖల అధికారులకు తెలియజేసినప్పటికీ సమస్యల పరిష్కరించడంలో విఫలం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డివిజనల్ అధికారి శేష శైలజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెవిన్యూ డివిజనల్ అధికారి శేష శైలజా మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో తాగునీరు విద్యుత్తు రహదారి కల్పనకు సంబంధిత శాఖలతో మాట్లాడి మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తానని హామీఇచ్చారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతి నిధులు, జిల్లా అధికారులు స్పందించి గిరిజన ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని లేనిచోకలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎందు దొర, సిపిఐ నాయకులు కే సత్యనారాయణ అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను పరిష్కరించాలి

జిల్లా కన్వీనర్ పురం అప్పారావు

విశాలాంధ్ర -విజయనగరం టౌన్: గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీ గ్రీన్ అంబాసిడర్ల క్రాప్ మిత్రుల సంఘం (ఏఐటీయూసీ) జిల్లా కన్వీనర్ పురం అప్పారావు డిమాండ్ చేశారు. సోమవారం దీనికి సంబంధించి కలెక్టర్ కార్యాలయం వద్ద నిర సన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పురం అప్పారావు మాట్లాడుతూ గ్రామ పంచా యితీలలో పారిశుధ్య పనులుచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు బకాయి పడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. గతంలో 6 వేల నుండి పదివేల రూపాయల పెంచుతూ వెలువడిన జీవో నేటికీ అమలు కాలేదన్నారు స్వచ్ఛభారత్ బండ్లను రిపేర్లు చేసి పని భద్రత కల్పించాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపి పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ బి పోలిరాజు ,అయ్యప్ప, ఎం సూర్యనారాయణ పాల్గొన్నారు.

స్పందనకు 112 వినతులు

ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్న కలెక్టర్ సూర్యకుమారి

విశాలాంధ్ర-విజయనగరం : జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం జరిగిన స్పందన (జగనన్నకి చెబుదాం) వినతుల కార్యక్రమానికి వివిధ సమస్యలకు సంబంధించిన 112 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 78 ఫిర్యాదులు వచ్చాయి. డీపీవోకు 10, డీఆర్డీఏ, గృహ నిర్మాణ శాఖలకు చెరో ఏడేసి ఫిర్యాదులు రాగా ఈపీడీసీఎల్ కు 5, మున్సిపాలిటీకి 3, డీఎం &హెచ్ఓకు, సచివాలయ విభాగానికి చెరో ఒకటి వచ్చాయి. ప్రజల నుంచి వినతులపై సత్వరమే స్పందించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ తో పాటు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో ఎం. గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు సుదర్శనదొర, సూర్యనారాయణలు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ విభాగాలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సురేష్ బాబుకు ఎమ్మెల్సీగా మరోసారి అవకాశం

విశాలాంధ్ర-విజయనగరం: ఎమ్మెల్సీ పివివి సూర్యనారాయణ రాజుకు వైసిపి అధిష్టానం మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది.మొత్తం 18 ఎమ్మెల్సీలకు సంబంధించిన పేర్లను సోమవారం పార్టీ అధిష్టానం విడుదల చేసింది. ఈ ఏడాది మార్చి 29తో సూర్యనారాయణరాజు పదవీకాలం ముగియ నుండగా, తాజాగా మరోసారి ఎమ్మెల్యే కోటాలో సూర్యనారా యణరాజు పేరునే అధిష్టానం ఖరారు చేసింది. దీంతో సొంత నియోజకవర్గమైన నెల్లిమర్లతో పాటు జిల్లాకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు.

విశాఖలో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కు ఏయూ వీసీ తూట్లు

చర్యలకై ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ డిమాండ్

విశాలాంధ్ర-బొబ్బిలి : అధ్యాపకులతో ఏయూ వైస్ ఛాన్సలర్ సమావేశం ఏర్పాటు చేయడం ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ ఉపాధ్యాయులు పట్టభద్రుల అభ్యర్థులు గెలుపు కోసం ప్రచారం చేస్తున్న ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అధికారాన్ని అడ్డం పెట్టుకొని అడ్డు దారిలో ఎలాగైనా ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకోవాలన్న దుర్మార్గపు ఆలోచనలతో వైఎస్ఆర్ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేయడం చాలా బాధాకరమని దుర్మార్గపు చర్యలను ఖండించాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఆంధ్ర యూనివర్సిటీ వీసీ రిజిస్టర్, ప్రైవేటు డిగ్రీ కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించడం ఎన్నికల నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించిందని, ప్రజాస్వామ్య వ్యవస్థ కు తూట్లు పొడిచారని ఆరోపించారు. వెంటనే ఆంధ్ర యూనివర్సిటీ వీసీ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

వాస్తవాలు తెలుసుకోకుండా కొన్ని పత్రికలు, ఛానల్‌లో తప్పుడు కధనాలు

ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు

విశాలాంధ్ర-దత్తిరాజేరు: వాస్తవాలు తెలుసుకోకుండా కొన్ని పత్రికలు, ఛానల్‌లో తప్పుడు కధనాలు రాస్తున్నాయని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు మండల పరిషత్ కార్యాలయం లో సోమవారం విలేకరుల సమావేశంలో తెలియజేసారు. గజపతినగరం నియోజకవర్గంను అన్ని విధాలగా అభివృద్ధి చేసిన ఘనత బొత్స అప్పలనరసయ్య కె దక్కుతుందన్నారు. ఇటీవల కొన్ని ఛానల్ లో వచ్చిన కథనాలు అవాస్తమని అయన అన్నారు.తప్పుడు కధనాలు ప్రసారం చేసినంతమాత్రాన ప్రజలు నమ్మరన్నారు. ఈ కార్యక్రమం లో వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.
21
...

వాలీబాల్ లో రావాడ పాఠశాల విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర-భోగాపురం: రాష్ట్ర స్థాయి వాలీబాల్ మండలానికి చెందిన రావాడ పాఠశాల విద్యారి ప్రతిభ కనపరిచారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో ఫిబ్రవరి 14 వ తేదీ నుండి 16 వ తేదీ వరకు పల్నాడు జిల్లా నర్సరావుపేట లో 14 సంవత్సరాలు లోపు రాష్ట్ర స్థాయి బాల బాలికల వాలిబాల్ పోటీలు నిర్వహించారు. రావాడ వ్యాయమ ఉపాధ్యాయుడు కె.వి.ఎ. ఎస్ రాజు ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టులో రావాడ పాఠశాల విద్యార్థి ఎస్.సంపత్ గణేష్ పాల్గొనడం పట్ల స్కూల్ ప్రదానోపాధ్యాయురాలు బి.శైలజారాణి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. అదేవిధంగా బాలికల జట్టులో పి.ప్రణీత కూడా పాల్గొనడం పట్ల అభినందనలు తెలియజేశారు.

మహాశివరాత్రి జాతరకు.. శ్రీసన్యాసేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.7,71,611/-

విశాలాంధ్ర-శృంగవరపుకోట: మహా శివ రాత్రి జాతరకు గాను పురాతన ఆలయంగా పేరు పొందిన శ్రీసన్యాసేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు హుండీల ద్వారా సమర్పించిన ఆదాయం రూ.7,71,611/-లని దేవస్థానం ఈఓ బి.శ్రీనివాస్ వెల్లడించారు. సన్యాసేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం నుండి విచ్చేసిన సీనియర్ అసిస్టెంట్ శ్యాంప్రసాద్ పర్యవేక్షణలో హుండీలను తెరిచి ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో మాజీ ట్రస్టు బోర్డు ఛైర్మెన్ జి.పైడితల్లి, శ్రీవారి సేవా భక్తులు, అర్చకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. కాగా నేడు టిక్కెట్లు, తలనీలాలు ద్వారా సమకూరిన ఆదాయాన్ని లెక్కించనున్నట్లు ఈఓ శ్రీనివాస్ వివరించారు.

సీతం కళాశాల ను సందర్శించిన డిఆర్‌డిఓ, ఐఐయస్‌సి శాస్త్రవేత్తలు

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : కుతూహలం కలిగి ఉండగలగడం, జ్ఞానాభివృద్ధికి మొదటిమెట్టు అని డా. పి యస్ ఆర్ శ్రీనివాస శాస్త్రి అన్నారు. డా.శ్రీనివాస శాస్త్రి డి ఆర్ డి ఓ లో పనిచేస్తూ పలు ఉపగ్రహాలను రూపొందించి కక్షలో ప్రవేశపెట్టిన శాస్త్రవేత్త .ఉపగ్రహ శకలాలు, జీవితకాలం ముగిసిన ఉపగ్రహాలు హెచ్చుగా అంతరిక్షంలో మిగిలిపోవడం, కొత్త ఉపగ్రహాల ప్రవేశానికి ఒక చిక్కు సమస్య. ఇటువంటివి మరెన్నో సమస్యలను పరిష్కరించడం ద్వారా ఉత్సాహవంతులైన అధ్యాపకులు, విద్యార్థులు మంచి భవిష్యత్తు కు బాట వేసుకోగలరని ఆయన పునరుద్ఘటించారు. ఐ ఐ యస్ సి బెంగళూరు ప్రొఫెసర్ డా.రాధాకాంత్ పాది ప్రసంగిస్తూ రాబోవు రోజులలో అధ్యాపకులు కొత్త బోధనా విధానానికి ,ప్రాజెక్టులు ద్వారా బోధన కొనసాగించడానికి, కొత్త ఆవిష్కరణలకి అలవాటు పడాలని అభిప్రాయపడ్డారు. ఇటువంటి అద్భుత శాస్త్రవేత్తలు సీతం లో అడుగుపెట్టడం సంతోషదాయకం అని కళాశాల డైరెక్టర్ డా.ఎం.శశిభూషణ రావు అన్నారు. ఈ సభలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భోజన పథకాన్ని తనిఖీ చేసిన ఎంపీడీఓ

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో ఎం.ఆర్. అగ్రహారం ఎంపీపి స్కూల్ నందు నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసిన ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ, ఈ సందర్భంగా అటెండన్స్, మెనూ స్టాక్ రిజిస్టర్లను, గోరుముద్ద వంటకాలను పరిశీలించి పాఠశాలలో విద్యార్థులు అందరూ విధిగా పాఠశాలకు హాజరు కావాలని, ప్రతీ ఒక్క విద్యార్థి స్కూల్ లో అమలుచేస్తున్న భోజనం మాత్రమే చేసే విధంగా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జే. తిర్దాదరావు పాల్గొన్నారు.

కొండను దొలిచేస్తున్నారు....

ఆర్డీవో దృష్టికి తెచ్చిన మెంటాడ గ్రామస్తులు

విశాలాంధ్ర-మెంటాడ : మెంటాడ కొండను తవ్వి గ్రీన్ ఫీల్డ్ ఆరు లైనుల రోడ్డుకు గ్రావెల్ ను ఉపయోగించడంపై మెంటాడ గ్రామస్థులు సోమవారం బొబ్బిలి ఆర్డీవో శేషశైలజను నిలదీశారు. కొండను తవ్వి దెబ్బ దీసేలా చేయడం దుర్మార్గపు చర్య అని ఆమె వద్ద మొరపెట్టుకున్నారు. ఈ రోడ్డుకు ఎంత మేరకు గ్రావెల్ త్రవ్వకం చేపట్టడానికి అనుమతులు మైనింగ్ శాఖ అనుమతులిచ్చారో తెలపాలని ఆమెను నిలదీశారు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో మండలానికి సంబంధించి రోడ్లు ఇతరత్రా అభివృద్ధి పనులకు గ్రావెల్ దొరికే అవకాశం ఉండదని ఆమె వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణం పనులు చరవేగంగా చేయడం జరుగుతున్న నేపథ్యంలో రోడ్డుకిరు వైపులా పంటపొలాలకు కాలువలు నిర్మాణాలు చేపట్టి, పంట దినుసలను తెచ్చుకునేందుకు రహదారి మార్గాలను ఏర్పాటుచేయాలని రైతులు కోరారు. అదేవిధంగా జక్కువ గ్రామ సమీపంలో సర్వే నెంబరు 15 భూములు ఇచ్చిన రైతులకు పరిహారవిషయంలో సమస్యలు వున్నాయని గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి రైతులు అడ్డు తగలడంతో ఆర్డీవో రైతుల సమస్యలను సద్దుమణిగేలా చూడాలని ఆమె తహశీల్దార్ కు ఆదేశించారు.దీంతో ఆమె ఆయా గ్రామాల అభివృద్ధికి నిధులు అవసరమైతే చెప్పాలని,వాటికి సంబంధించి రోడ్డు కాంట్రాక్టర్‌కు చెప్పి ఏర్పాటుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆమె గ్రామస్థులకు ఆమె హామీ ఇచ్చారు.

శ్మశాన వాటిక స్థలాన్ని అప్పగించండి

మెంటాడ శశ్మాన వాటిక స్థలం ఆక్రమణదారులు నుంచి అప్పగించాలని మెంటాడ గ్రామస్థులు ఆమెను కోరారు.మండలతహశీల్దార్ ఆదిబాబు ఆధ్వర్యంలో సోమవారం జెసిబి సహాయంతో ఆక్రమణకు గురైన భూమిని చదును కు సన్నాహాలు చేస్తున్న సమయంలో ఆక్రమణదారులు అడ్డు తగిలారు. ఈవిషయంలో గ్రామ పంచాయతీ తీర్మానం చేసి పనులను చేపట్టిన వారిని అడ్డుకోవడం చట్ట రీత్యా నేరమని,ఈవిషయంలో ఆంధ్ర పోలీసుస్టేషన్ ను ఆశ్రయించనున్నట్లు గ్రామస్థులు ఆర్డీవో శేషశైలజను, మండలతహశీల్దార్ ఆదిబాబు ను కోరారు. విషయంలో అధికారులు గ్రామస్థులకు శశ్మానానికి స్థలంలేక నానా అవస్థలు పడుతున్నామని ఆమె వద్ద గ్రామస్థులు మొరపెట్టుకున్నారు. దీనిపై గ్రామస్థులకు ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేగిడి రాంబాబు,మాజీ సర్పంచ్ రాయిపిల్లి రవిశంకర్,సిరిశెట్టి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరుని వద్ద తగ్గని భక్తుల రద్దీ

విశాలాంధ్ర-వంగర: పుణ్యక్షేత్రం సంగాం సంగమేశ్వర ఆలయంకి భక్తుల రద్దీరోజు, రోజుకుపెరుగుతుంది. భక్తులు ఆలయం,త్రివేణి సంగమం, అలయంవద్దనుక్యూ లోనే కాక జాతరలో కూడా ఎడతెరిపిలేని భక్తులతో నిండి పోయింది. సోమవారం అయినందున శివునికి ఇష్టమైన రోజైనందున భక్తులు రద్దీ అమాంతంగా పెరిగింది. ఈ రోజు పాలకొండ శాసనసభ్యులు విశ్వాసరాయి కళావతి,ఎంపీపీ సురేష్ ముఖర్జీ సతీ,సమేతంగా ఆపరమేశ్వరుని వద్ద ప్రత్యేకఅభిషేకం చేశారు. అర్ధరాత్రి12 గంటల నుండియేసంగమేశ్వరుని భక్తుల రద్దీ విపరీతంగాపెరిగింది.ఇటు గుడి వద్దను, అటు త్రివేణి సంగమం వద్దను ఎక్కడ చూసిననూ భక్తులే, భక్తులు సందడి కనిపించింది. క్యూ లో మాత్రం మహిళలు ఇబ్బందు గంటలు కొలది పడటంకనిపించింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆనందరావు,ప్రధాన అర్చకులు ఎన్.గణపతి,వావిల పల్లిసూర్యనారాయణతధితరులువున్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మున్సిపాలిటీ లోని కొత్తవలస సచివాలయ పరిధిలో గృహ సారుదులతో కలిసి ప్రత్యేక సమావేశంపై పార్టీ భవిష్యత్ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపార్టీ భవిష్యత్ కార్యాచరణపై వచ్చే నెల 18వ తేదీ నుంచి గృహ సారథులు ఇంటి ఇంటికి వెళ్లి నిర్వహించబోయే "జగన్ అన్నే మా భవిష్యత్తు" ప్రచార కార్యక్రమం నిర్వహణపై అను సరించాల్సి ఉందన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో వైసిపి పార్టీ ఘన విజయం సాధించడమే ప్రధాన కర్తవ్యంగా తీసుకుని జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సీఎం గా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క కార్యకర్త, నాయకులపై కలదని అందుకు ముందుగానే పార్టీ కేడర్ అంతా సమాయత్తం అవ్వాలని సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు మీ మీ పరిధిలో గల ప్రతీ ఇంటి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించి ప్రతీ కుటుంభం నుంచి ప్రజల పూర్తి మద్దతు కోరాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ ఇందుపూరు గున్నేశ్వ రరావు, పార్టీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, పట్టణ జేసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవ రావు, స్థానిక కోఆప్షన్ సభ్యులు వెంకట్రావు, గోగు గాయత్రి, కౌన్సిలర్ ఎస్ లావణ్య, ఆయా వార్డుల సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు సిబ్బందికి జీతాలివ్వండి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విభాగం (ఏపీ సీఎన్ ఎఫ్)లో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఐటిడిఏ పీఓ సి. విష్ణుచరణ్ ను ఆ పార్టీ నాయకులు వంగల దాలి నాయుడు, బంటు శిరీస్ తదితరులు కలిసి ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు జీతాలు పై చర్చించారు.2022 ఏప్రిల్ నుండి జీతాలు చెల్లించకపోతే వారు ఏ విధంగా బ్రతుకుతారని ప్రశ్నించారు. ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు, పచారి సామాన్లు తదితరు వాటికి నెలనెలా చెల్లించాల్సి ఉండగా గత పది నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొంత మంది ఉద్యోగులు పిల్లలు ఫీజులు కూడా కట్టలేని దుస్థితిలో ఉన్నారన్నారు. కొంతమంది వచ్చిన కొద్దిపాటి జీతంపై ఆధారపడుతూ అప్పులు చేసి బతుకుతున్నారన్నారు. తక్షణమే వారికి జీతాలు చెల్లించాలని కోరారు. దీనికి స్పందించిన పీవో సి.విష్ణుచరణ్ తగు చర్యలు తీసుకోవాలంటే వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

ఏనుగులు ఇంకెంత మంది ప్రాణాలు బలిగొనాలి?

- రైతుల పంటల ధ్వంసం చేస్తున్న రైతుకి ఏది ప్రభుత్వ సాయం....
- ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ఆటంకాలు తొలగించాలి
-ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి పభుత్వానికి సూటి ప్రశ్న?

విశాలాంధ్ర-పాలకొండ: మన్యం జిల్లాలో గత దశాబ్ద కాలంగా ఏనుగులు రైతులు, ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వీటిని తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తంపటపల్లి గ్రామాన్ని రైతు సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఏనుగుల వల్ల పంట నష్టం, తో పాటు ప్రజలతో పాటు మూగజీవాల ప్రాణాలు పోతున్నా పాలకులకు చీమ కుట్టినట్లయినా లేదన్నారు. ఇప్పటికే జిల్లాలో ఏనుగుల బారిన పడి 22 మంది వరకు చనిపోయారని, వందలాది ఎకరాల్లో పంట ధ్వంసం చేస్తున్న పూర్తిగా రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకున్న పాపాన ఫారెస్ట్ అధికారులు చేయటం లేదని, ఏనుగుల సమస్య పరిష్కారం కోసం ఉద్యమం తప్పదని సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు. తమ ధాన్యం సేకరణకు మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ ఇవ్వకపోవడంతో మా ధాన్యాల కొంటారో లేదో తెలియని అయోమయంలో ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన దీనిపై స్పందిస్తూ ప్రభుత్వం వైఖరి నిరసిస్తూ ఈనెల 25వ తేదీ నుంచి కలెక్టర్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నామన్నారు. రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యం కొనుగోలు చేసేంత వరకు జరిగే ఈ కార్యక్రమంలో మీ అందరూ భాగస్వాములు కావాలని సంఘం కార్యదర్శి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. బ్యాంక్ గ్యారంటీలు గురించి జిల్లా కలెక్టర్ మిల్లర్లతో మాట్లాడి రైతు వద్ద ఉన్న ధాన్యాన్ని తీసుకోవాలని సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. రైతుల వద్ద ఉన్నా మొత్తం ధాన్యాన్ని తీసుకోవాలని కోరుతూ ఈనెల 25వ తేదీ నుంచి కలెక్ట్ కార్యాలయం వద్ద జరిగే రిలే నిరాహార దీక్ష కార్యక్రమం ఉంటుందని తెలిపారు. తయారైన అపరాల పంటైన పెసర, మినుము, పంటలను రైతులు అమ్ముకుందామంటే మార్కెట్లో వ్యాపారస్తులందరూ కుమ్మక్కై ధర తగ్గించడం వంటి అంశాలు చోటు చేసుకుంటున్నాయని తక్షణమే జిల్లా పౌరసరఫలాలు శాఖ అధికారులు ఆయా వ్యాపార కూడలిలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని రైతులకు మద్దతు ధర అందేటట్లు చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కిమిడి రామ్మూర్తి నాయుడు, రైతు సంఘం సీనియర్ నాయకులు బివి రమణ, అల్లు సురేష్ కుమార్, దుర్గారావు, రామయ్య, సోములు తదితరులు ఉన్నారు.

జిసిసి ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలి : - గిరిజన సంఘం డిమాండ్

విశాలాంధ్ర-సీతంపేట: మన్యం ప్రాంతంలో గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలని కోరుతూ సోమవారం గిరిజన సంఘం నాయకులు సిఐటియు కార్యాలయం నుండి సీతంపేట బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిసిసి ఉత్పత్తులు గ్రేడ్ వన్ కొండచిపురులకు రూ.70లు ప్రకటించాలని, పసుపుకి ఒక కేజీకి రూ.100లు, ఉసిరికి పప్పుకు రూ 100లు, ఇందుగు పిక్కలు రూ.65 లు, కుంకుడుకాయలు రూ.60లు, నరమామిడి చెక్క కేజీకి రూ.50లు, మద్దతు కల్పించాలని కోరారు. అటవీ ఉత్పత్తులకు జిసిసి ప్రకటించిన ధరలు చాలా తక్కువ మార్కెట్ కంటే ఉన్నాయని అటవీ ఉత్పత్తులకు నూతన మద్దతు ధర కల్పించాలని గిరిజన సంఘం నాయకులు ఏ గంగాధర్ తెలిపారు. అనంతరం వారి డిమాండ్లతో ఉన్నటువంటి వినతిపత్రాన్ని జిసిసి మేనేజర్ దానరి కృష్ణా కుఅందించారు. ఈ కార్యక్రమంలో జీలకర్ర శ్రీరాములు, బి అప్పారావు, అద్దాయి, బాపన్న తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ స్పందనకు 85 దరఖాస్తులు

విశాలాంధ్ర-పార్వతీపురం: స్పందన కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఓ.ఆనంద్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. 85 దరఖాస్తులు స్పందన కార్యక్రమంలో అందాయి. అర్జీల వివరాలిలా ఉన్నాయి. గుమ్మ లక్ష్మీపురం మండలం మంత్రజోల గ్రామంలో 120 కుటుంబాలు ఉన్నాయని, 200కు పైగా విద్యార్థులు ఉన్నారని, గ్రామానికి రోడ్డు సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నామని, గ్రామానికి బిటి రోడ్ మంజూరుచేయాలని పి. కామేశ్వరరావు తదితరులు దరఖాస్తు అందజేశారు. బలిజిపేట మండలం వెంగళరాయపురం గ్రామానికి చెందిన జి. సన్యాసి, గ్రామస్తులు మేము సాగు చేస్తున్న భూమికి ప్రభుత్వ అధికారులు డి పట్టా ఇచ్చారని, ఇనామ్ భూములు అయినందున రైతు వారి పట్టా మంజూరు చేయవలసిందిగా అర్జీ సమర్పించారు. గుమ్మలక్ష్మీపురం మండలం దుమ్మంగి పంచాయతీ పరిధిలోగల కోసంగిభద్ర, టెంకసింగి, కొరటి గూడ గ్రామాల్లో గల పాఠశాలలకు పునాదులు వేసి వదిలేశారని వాటిని త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, గుమ్మలక్ష్మీపురం మండలం పెదఖర్జ పంచాయతీ గోరటి, పెదఖర్జ ఎస్సీ వీధిలో కరెంటు స్తంభాలు శిధిలావస్థలో ఉన్నాయని వాటిని మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఇరిడి ప్రాదేశిక ఎంపిటిసి కె.మల్లేశ్వరరావు వినతి పత్రం అందజేశారు. గరుగుబిల్లి మండలం గొట్టివలస గ్రామానికి చెందిన పి.సూర్యనారాయణ, గ్రామస్తులు గొట్టివలస గ్రామ రెవెన్యూ లో ఉన్న కొండపైన భాగాన్ని జీడి, టేకు మొక్కలను వేసి సాగు చేసుకుంటున్నామని, ఈ కొండకు డిపట్టాలు 8 విడతలో ఇస్తారని రెవెన్యూ అధికారులు చెప్పి ఉన్నారని, ప్రస్తుతం ఆ కొండకు రెవెన్యూ అధికారులు కొలతలు వేసి ఉన్నారని అది ప్రభుత్వ స్థలమని చెబుతున్నారని, మేము సాగుచేస్తున్న కొండకు మాకు డిపట్టాలు ఇప్పించి మా కుటుంబాలను ఆదుకోవాలని దరఖాస్తు అందజేశారు. పార్వతీపురం పట్టణం నాయుడు వీధికి చెందిన పి. వెంకటరమణ జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకంకు రూ.15,000 కట్టానని తనకు ఇంటి పట్టా ఇప్పించవలసిందిగా కోరారు. మక్కువ మండలం బట్టివలస గ్రామానికి చెందిన వి. వెంకట్రావు, రైతులు మా వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. పార్వతీపురం మండ లం ఎస్టీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన జి .చిన్నరావు జమదాల రెవెన్యూలో సుమారు 60 సెంట్లు జీడి తోటను సాగుచేస్తున్నామని, ఆ భూమికి డిపట్టా ఇప్పించవలసిందిగా కోరారు. గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్ పేట గ్రామానికి చెందిన జి. లక్ష్మి విడో పెన్షన్, రేషన్ కార్డును మంజూరు చేయవలసిందిగా కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి. జగన్నాథరావు, డి.ఆర్.డి.ఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా. ఎంవిజి కృష్ణాజి, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్రరావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వ య అధికారి వి. చిట్టిబాబు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎండి నాయక్, జిల్లా సరఫరా అధికారి కెవిఎల్ఎన్ మూర్తి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా పశు సంవర్ధక అధికారి ఎ.ఈశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఎస్.డి.వి రమణ, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఉరిటి సాయి కుమార్, జిల్లా ప్రణాళిక అధికారి పి. వీరరాజు పాల్గొన్నారు.

మహిళా మార్ట్ పేరుతో డబ్బులు వసూళ్లు ఆపాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్/ బెలగాం: మున్సిపాలిటీ పరిధిలోని సుమారు 1200 పొదుపు సంఘాల మహిళల వద్ద నుండి సుమారు 18 లక్షలు రూపాయలు మహిళా మార్ట్ స్మార్ట్ కార్డుల కోసం డబ్బులు వసూళ్లకు పూనుకోవడం అన్యాయమని పట్ల పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పాకల సన్యాసిరావు విమర్శించారు.ఈ మేరకు సోమ వారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ఆర్భాటంగా మహిళా మార్ట్ లు ప్రవేశ పెడుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించి ఇలా మహిళల వద్ద నుండి షేర్ క్యాపిటల్ రూపంలో డబ్బులు వసూలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్పొరేట్ ప్రపంచంలో మహిళలు వ్యాపారంలో ముందుకు రావాలంటే ప్రభుత్వం సబ్సిడీ రేట్లకు సరుకులను అందజేసి మార్కెట్లో అమ్మకం చేసేవిధంగా నిబంధనలు రూపొందించి మహిళా మార్ట్ లు ఏర్పాటు చేయాలని అలాంటప్పుడే ఈ మహిళ మార్ట్‌లు విజయవంత అవుతాయని లేనిచో మహిళలు తీవ్ర నష్టాలకు గుర య్యే ప్రమాదం ఉందన్నారు ఇప్పటికైనా ప్రభుత్వ నిధులతో మహిళ మార్ట్ లు ఏర్పాటుకు ప్రయత్నించాలని, మహిళల వద్ద నుండి డబ్బు లు వసూళ్లకు పాల్పడడం విరమించుకోవాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో నాయకులు గొర్లి వెంకటరమణ, కొల్లి సాంబమూర్తి పాల్గొన్నారు.

ఎఫ్.డి.సి ముందస్తు షెడ్యూల్ తెలియజేయాలి

విశాలాంధ్ర-బెలగాం: ఫ్యామిలీ డాక్టరు విధానం (ఎఫ్.డి.సి)లో గ్రామాల పర్యటన షెడ్యూల్ ముందుగా తెలియజేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బగాది జగన్నాథరావు అన్నారు. వీరఘట్టం మండలం నడుకూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టరు వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది నిర్వహిస్తున్న రిజిస్టర్లు, కేస్ స్టడీ షీట్ లను పరిశీలించారు. వైద్య శిబిరం వద్దకు వచ్చిన గ్రామస్తులతో మాట్లాడారు. వైద్య సేవలు, మందులు అందుతున్న తీరు అడిగి తెలుసుకున్నారు. మందులు వైద్యుల సూచనల మేరకు వేసుకోవాలని తద్వారా వ్యాధులు త్వరగా నయమవుతాయని చెప్పారు. ఆనందంగా, సంతోషంగా, సంతృప్తిగా ఉండటం అలవాటు చేసుకోవాలని హితవు పలికారు. ఫ్యామిలీ డాక్టరు వైద్యానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ ప్రేమ ఆప్యాయతతో వైద్య సేవలు అందించాలని వైద్యులకు, వైద్య సిబ్బందికి సూచించారు. వైద్య పరీక్షలు చేసి అవసరమగు మందులు ఇస్తూ సూచనలు పక్కాగా చేయాలని, పౌష్టిక ఆహారం గూర్చి వివరించాలని, సంపూర్ణ పోషణ అభియాన్ కిట్లు అందుతున్నదీ లేనిది గుర్తించాలన్నారు. బిపి, మధుమేహం, కిడ్నీ, కేన్సర్ వంటి అంటు వ్యాధులు (ఎన్.సి.డి) కాని వాటితో పాటు అంటువ్యాధులు (సి.డి) పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి డా. ఉమామహేశ్వరి, డెమో వై. యోగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆదుకుంటాం: ఎమ్మెల్యే

జన్నేటి పార్థివదేహాన్ని సందర్శించిన జోగారావు

జన్నేటి శ్రీనివాసరావు

విశాలాంధ్ర -పార్వతీపురంటౌన్: ప్రముఖ జాతీయ దినపత్రిక విశాలాంధ్ర పార్వతీపురం గ్రామీణ విలేకరిగా విధులు నిర్వహిస్తున్న జన్నేటి శ్రీనివాసరావు సోమవారం అకాల మరణం చెందారు. ఈ విషాదకర విశయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు జిల్లా అసుపత్రికి చేరుకుని దివంగత విలేకరి శ్రీనివాసరావు పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు భార్య, పిల్లలను ఓదార్చి వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపి శ్రీనివాసరావు కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్వ రరావు, బీజెపి పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, విశాలాంధ్ర విశాఖపట్నం యూనిట్ మేనేజర్ సిహెచ్ రామకృష్ణ, పార్వతీ పురం, విజయనగరం జిల్లా విశాలాంధ్ర స్టాఫ్ రిపోర్టర్లు, విశాలాంధ్ర కుటుంబసభ్యులు, పార్వతీపురం పట్టణ ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా సిబ్బంది శ్రీనివాసరావు మృతదేహానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాగ్దేవి, వైద్యులు, ఏఎంసి వైస్ చైర్మన్ వానపల్లి శంకర్రావు, జిల్లా పత్రికా విలేకరులు, మీడియా మిత్రులు, వైసీపీ సీనియర్ నాయకులు, కుటుంబ సభ్యులు ఉన్నారు. అలాగే విశాలాంధ్ర పట్ల అంకితభావంతో పనిచేసిన జన్నేటి శ్రీనివాసరావు మృతి విశాలాంధ్రకు తీరని లోటని విశాలాంధ్ర ఎడిటర్ ఆర్వీ రామారావు, జీఎం హర్‌నాథ్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన పవిత్ర ఆత్మకు శాంతిచేకూరాలని, ఆయన కుటుంబానికి తమ ప్రగాడ సంతాపాన్ని తెలియజేశారు.

పూలమాలవేస్తున్న జగదీశ్వరరావు

నివాళులర్పిస్తున్న బొబ్బిలి చిరంజీవులు

సన్యాస్వేశ్వరస్వామి వారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే లలితకుమారి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం పంచాయితీ సన్యాసయ్య పాలెంలో గల పురాతన శ్రీసన్యాస్వేశ్వర స్వామి వారిని పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సోమవారం దర్శించుకున్నారు. సంప్రదాయ ప్రకారం శ్రీ సన్యాస్వేశ్వర స్వామి వారికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చనలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ బి.శ్రీనివాస్ స్వామి వారి తీర్థ ప్రసాదాలను మాజీ ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సైకో సీఎం జగన్మోహన్ రెడ్డి పాలన పోయి ప్రజలందరి బాధలు, ఇబ్బందులను తొలగించే చంద్రబాబు నాయుడు పాలన మళ్లీ రావాలని ప్రార్థించానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, ధర్మవరం సర్పంచ్ గాలి సన్యాసయ్య, నాయకులు లగుడు తిరుపతి, చెక్కా కిరణ్ కుమార్, కాపుగంటి శ్రీనివాసు, కిలపర్తి ముత్యాలనాయుడు, పెదగాడ రాజు, పోతనాపల్లి నాయుడు, కార్యకర్తలు, యువత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి స్థాపన- సంఘర్షణల నివారణే రోటరీ లక్ష్యం

రోటరీ అధ్యక్షులు జె సి రాజు



విశాలాంధ్ర-బొబ్బిలి : ప్రపంచ శాంతి స్థాపనలో సంఘర్షణ ప్రాంతాలలో శాంతిని నెలకొల్పటమే లక్ష్యం గా అంతర్జాతీయ రోటరీ సంస్థ కృషి చేస్తున్నదని రోటరీ క్లబ్ అధ్యక్షులు, నారాయనప్పవలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె సి రాజు అన్నారు.సోమవారం భోజన విరామ సమయంలో ప్రపంచశాంతి.. సంఘర్షణ నివారణ ... రోటరీ చేస్తున్న కృషిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ శాంతి అవగాహన ర్యాలీ నిర్వహించారు. జె సి రాజు మాట్లాడుతూ ఫిబ్రవరి నెలను రోటరీ ఇంటర్నేషనల్ ప్రపంచ శాంతి.... సంఘర్షణల నివారణ మాసం గా నిర్వహిస్తున్నదని దీనిలో భాగంగా పాఠశాలలోని, కళాశాలల్లోనూ అవగాహన కార్యక్ర మాలు నిర్వహిస్తున్నామని తెలియచేసారు.ఈ అవగాహన కార్యక్రమంలో జెసి రాజు మాట్లాడుతూ యుద్ధాన్ని సృష్టించటం, పోరాడటం, మరియు ప్రజలకు బాధలు కలిగించటం కంటే శాంతి స్థాపనకు, సంఘర్షణలు పరిష్కారం ఉత్తమ మైన మార్గమని అందు రోటరీ ప్రపంచవ్యాప్తంగ శాంతి పరిరక్షణ టీమ్స్ ను ఏర్పాటు చేస్తున్నదని అన్నారు. ఆధిపత్య ధోరణితోనే సంఘర్షణలు తలెత్తుతున్నాయని వాటి నివారణకు అందరం కలిసి పనిచేయాలని కోరారు.శాంతి ద్వారా అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించ వచ్చని అన్నారు. హింస ద్వారా, సంఘర్షణలు ద్వారా యుద్ధాల ద్వారా మానవ జీవనం అస్తవ్యస్తం అవుతాయన్నారు. ప్రపంచశాంతి పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాను, శ్రీనివాస రావు, మహేష్ లు పాల్గొన్నారు.

బిజెపి బడ్జెట్ కి నిరసనగా 24న జిల్లా మండల కేంద్రాల్లో సిపిఎం ధర్నాలు

విశాలాంధ్ర-బెలగాం: స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు సోమవారం జిల్లా, మండలం ధర్నా కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అంబానీ, అదాని కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన బడ్జెట్ను ప్రవేశపెట్టి ఎస్సీ ఎస్టీ రైతు వ్యవసాయ కార్మిక ప్రజా వ్యతిరేక బడ్జెట్ కి నిరసనగా గ్రామాల్లో పట్టణాల్లో రాజకీయ ప్రచారం నిర్వహించి ఫిబ్రవరి 24వ తేదీన పార్వతీపురం మండలం పట్టణం వారు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద, మిగిలిన అన్ని మండలాలు, మండల కేంద్రాల్లో ధర్నాలు ప్రదర్శనలు నిర్వహించాలని సిపిఎం పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యమ్మల మన్మథరావు, వాకాడ ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, రెడ్డి శ్రీదేవి పాల్గొన్నారు.

నేడు శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ 2023 నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఫిబ్రవరి 21 మంగళవారం కనపాక శ్రీ ఉమామహేశ్వర కమ్యూనిటీ హాల్లో జరగనుందని ఎలక్ట్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు (సి.హెచ్. రమణ) సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా సోమవారం క్లబ్ సభ్యులతో సమావేశాన్ని సోమవారం శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ సభ్యులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ కర్రోతు సత్యం, మరికొంతమంది వాకర్స్ క్లబ్ ఉద్యమకారులు, వాకర్స్ పెద్దలు హాజరవుతారని, గవర్నర్ చేతులమీదుగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభులంతా ప్రమాణ స్వీకారం చేస్తారని, ఈ కార్యక్రమానికి విజయనగరంలో ఉన్న వాకర్స్ సంస్థల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

ఉపాధ్యాయులు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-భామిని: పాతపట్నం మండలం, కొరసవాడ చెందిన సిరిపురం. మోక్షజ్ఞ (మూడు న్నర సంవత్సరాలు) బోన్ మారో సమస్యతో బాధపడుతున్నారు.ప్రస్తుతం హైదరాబాద్ సిటిజెన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక స్తోమత లేక బాధిత కుటుంబీకులు ఆరోగ్య ఖర్చులకు దాతలు సహకరించి ఆదుకోవాలని కోరుతున్నారు. సమాచారం తెలుసుకున్న భామిని మరియు కొత్తూరు మండల ఉపాధ్యాయులు 50వేలు సహాయాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మీసాల ప్రఫుల్ కుమార్, బిడ్డిక ప్రసాదరావు, గేదెల శివ, రోహిణీ శ్వరావు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బోదవ్యాధి నివారణ మందుల పంపిణీ

విశాలాంధ్ర-బెలగాం: బోదవ్యాధి నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని సమీక్షించడానికి జోనల్ అధికారి డా. మధుసూధన ప్రసాద్ పార్వతీపురం సోమవారం విచ్చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారి వారి కార్యాలయాన్ని సందర్శించి అధికారులకు ఎండిఎ కార్యక్రమం సక్రమంగా జరిగేలా దిశానిర్దేశం చేశారు. ఎండిఎ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఆయనతో జిల్లా మలేరియా అధికారి తులసి, డా.శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనధికారిక తనిఖీలను ప్రోత్సహించవద్దు

అంగన్వాడీ కేంద్రాల్లో అనధికారిక తనిఖీలపై కలెక్టర్ స్పందన

ఎంఈవోలకు, ఐసీడీఎస్ సీడీపీఓలకు పీడీ ద్వారా సర్క్యులర్లు

విశాలాంధ్ర-విజయనగరం: అంగన్వాడీ కేంద్రాల్లో అనధికారిక తనిఖీలను ప్రోత్సహించవద్దని, అధికారిక కార్యకలాపాలకు ఇబ్బంది కలిగించవద్దని ఐసీడీఎస్ సీడీపీవోలను, ఎంఈవోలను జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి ఆదేశించారు. జిల్లాలో ఇటీవల కొన్ని చోట్ల జరిగిన అనధికారిక తనిఖీలపై ఆమె స్పందిస్తూ సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. తనిఖీలు నిర్వహించే క్రమంలో తప్పనిసరిగా సంబంధిత శాఖ నుంచి లేదా జిల్లా యంత్రాంగం నుంచి అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. అనధికారిక వ్యక్తులు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేయటం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని పేర్కొన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చినప్పుడు జిల్లా శిశు సంక్షేమ అధికారికి సమాచారం అందించి పూర్వాపరాలు తెలుసుకోవాలని, ఆ తర్వాతే వారికి స్పందించాలని సూచించారు. తనిఖీ రిజిస్టర్ నిర్వహించి వాటిలో తనిఖీకి వచ్చిన వారి వివరాలను తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇటీవల కొంతమంది అనధికారిక వ్యక్తులు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన విషయం తన దృష్టికి రావటంపై స్పందించిన కలెక్టర్ సూర్యకుమారి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా సీడీపీవోలకు, ఎంఈవోలకు సర్క్యులర్లు జారీ చేశారు.

పటిష్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి

విశాలాంధ్ర-పార్వతీపురం: ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా అన్నారు. ఎన్నికల నిర్వహణ అంశాలపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై వస్తున్న ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటరు జాబితాపై వచ్చిన క్లైయిమ్ లు, అభ్యంతరాలు తక్షణం పరిష్కరించాలని పేర్కొన్నారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్ అంశాలు ఏమి లేవని చెప్పారు. డూప్లికేట్ ఓటరుగా ఫిర్యాదులు అందిన 12 దరఖాస్తులను పరిశీలించామని, విచారణలో అర్హతలు సరిపోతాయని చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన అన్నిబృందాలను నియమించామని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణుచరణ్, జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకటరావు, అదనపు పోలీసు సూపరింటెండెంట్ డా. ఓ.దిలీప్ కిరణ్, ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

అన్నివర్గాల శ్రమజీవులకు సామాజిక న్యాయం అందాలి

సదస్సులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కేశవరావు



విశాలాంధ్ర-శృంగవరపుకోట : అన్ని వర్గాల శ్రమజీవులకు సామాజిక న్యాయం అందాలని, అదే ఐక్యరాజ్య సమితి నినాదమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. కేశవరావు అన్నారు. ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 'అవరోధాలను అధిగమించండి-సామాజిక న్యాయం కోసం అవకాశాలు కల్పించండి' అనే సందేశాన్ని ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం ప్రకటించిందని గుర్తు చేశారు. అన్ని రకాల అసమానతలు రూపుమాపి ప్రపంచ ప్రజలందరికీ సామాజిక న్యాయం అందించటంలో ప్రపంచ ప్రజల సంస్థ ఐక్యరాజ్య సమితి శాఖలు ప్రపంచవ్యాప్తంగా పని చేస్తున్నాయని స్పష్టం చేశారు. అంతేకాక ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల ప్రభుత్వాలకు ఐక్యరాజ్య సమితి సూచనలు చేసిందన్నారు. ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో సామాజిక న్యాయం అంశం ఎంతో ప్రాధాన్యత కలిగిందని వ్యాఖ్యానించారు. అన్ని రంగాల్లో, అన్ని స్థాయిల్లో, అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేలా అవకాశాలు కల్పించ గలిగితేనే ఆధునిక ప్రగతి సాధ్యమౌతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ రవీంద్రనాద్, కె.వాసుదేవరావు, షేక్ వలీఖాన్, పి.భాస్కర్ ఆర్.శ్రీలక్ష్మి, జి.ఈరన్న, ఎం.రమేష్ కుమార్, సీహెచ్.శ్రీనివాసరావు ప్రసంగించారు. విద్యార్థులకు సామాజిక న్యాయ దినోత్సవం గురించి అవగాహన కల్పించారు.

నెమలాంలో గ్రౌండ్ ట్రూతింగ్ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో సోమవారం తాసిల్దార్ డి.రాజేశ్వం రావు వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం' లో భాగంగా తెర్లాం మండలం నెమలాం గ్రామ రెవెన్యూ గ్రామ పరిధిలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూతింగ్ పనులను సదరు గ్రామంలో గ్రామసభ పెట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా తాసిల్దారు మాట్లాడుతూ సర్వే టీము తప్పకుండా రైతుల సమక్షంలోనే వారి పొలాలను కొలతలు తీసుకోవాలని మరియు అప్పగించిన పనిని ప్రభుత్వ నిబంధన మేరకు వేగంగా పూర్తిచేయాలని సూచించారు. అదేవిధంగా ప్రతీ రైతు కూడ తమ పొలాలు దగ్గరకు సర్వే టీమ్ వచ్చినప్పుడు వారి ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్ తీసుకువచ్చి సర్వే టీమ్ కు అందచేసి సహకరించవలసిందిగా రైతులను కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ఎం వెంకటరమణ, గ్రామ రెవెన్యూ అధికారి,సర్వే సిబ్బంది, గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ నరసింహులు మరియు మాజీ జెడ్పీటీసీ బోను అప్పలనాయుడు, స్థానిక ఎంపీటీసీ, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పది నెలలుగా జీతాలివ్వకపోతే ఎలా బతుకుతారు...?

ఐటిడిఎ పిఓను కోరిన జనసైనికులు

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మండలం, జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విభాగం (ఎపిసిఎన్ఎఫ్) లో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్ ను ఆ పార్టీ నాయకులు వంగల దాలినాయుడు, బంటు శిరీస్ తదితరులు కలిసి ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు జీతాలపై చర్చించారు. జిల్లాలో సుమారుగా ఎల్1-66, ఎల్2-14, ఎంటిఎస్-14, ఎల్3-270 మంది వరకు ఉద్యోగులు ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్నారన్నారు. వారికి 2022 ఏప్రిల్ నుండి జీతాలు చెల్లించకపోతే వారు ఏ విధంగా బ్రతుకుతారని ప్రశ్నించారు. ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు, పచారి సామాన్లు తదితర వాటికి నెలనెలా చెల్లించాల్సి ఉండగా గత పది నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే వారికి జీతాలు చెల్లించాలని కోరారు. దీనికి స్పందించిన ఐటిడిఎ పిఓ సి. విష్ణు చరణ్ తగు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

వైసీపీ గెలుపునకు కృషి చేయాలి

ఎమ్మెల్యే శంబంగి చిన వెంకట అప్పలనాయుడు

విశాలాంధ్ర-బొబ్బిలి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇటీవలే నూతనంగా నియమించ బడిన బొబ్బిలి నియోజకవర్గం బాడంగి, బొబ్బిలి, రామభద్రపురం, తెర్లాం మండలాల వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా కన్వీనర్లు,కో-కన్వీనర్లు, సోమవారం బొబ్బిలి లో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి విచ్చేసి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా కన్వీనర్లు,కో కన్వీనర్లు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మమ్మలను గుర్తించి పదవులను కేటాయించడం చాలా సంతోషంగా ఉందని వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి ఫలాలను ప్రజలకు తెలిసేలా, ప్రతిపక్షాల కుట్రలను,పలు మీడియా ఛానళ్ల అడ్డంపెట్టుకుని చేస్తున్న అబద్ధపు ప్రచారాలను సోషల్ మీడియా ద్వారా తిప్పి కొట్టాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందన్నారు. అనంతరం రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను ఉద్దేశించి పలు సూచనలు చేశారు.ఉత్తరాంధ్ర పట్టభద్రుల అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపుకై ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు.2024 సార్వత్రిక ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా సోషల్ మీడియా వేదికగా పనిచేయాలని సూచించారు కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, పట్టణ జేసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరావు(విస్సు)తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజును గెలిపించే బాధ్యత పార్టీ శ్రేణులపై ఉంది : డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజక వర్గం నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి అయిన సీతం రాజు సుధాకర్ ను గెలిపించే బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఈ మేరకు సోమవారం వివిధ జోనల్ కార్యాలయాలలో పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం అయ్యారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్పొరేటర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రజా రంజిక పాలన సాగుతుందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ సిద్ధాంతాలను, జగన్మోహన్ రెడ్డి ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు గృహసారథులను, సచివాలయ కన్వీనర్లను ఏర్పాటు చేసామన్నారు. జరగనున్న శాసనమండలి ఎన్నికలలో వైసిపి బలపరిచిన అభ్యర్థిని గెలిపించే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఇంటింటికి వెళ్లి పట్టభద్రుల ఓటర్లను గుర్తించి అభ్యర్థుల గెలుపునకు వారిలో అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన సాగుతుందన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి తద్వారా అర్హులను గుర్తించి పథకాలను ప్రతి ఒక్కరికి అందించే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలో అభ్యర్థి గెలుపుకై పార్టీ ప్రతిష్టాత్మకంగా స్వీకరించిందని అన్నారు. అందువల్ల గెలుపు బాధ్యతను వైసిపి శ్రేణులు పై ఉంచిందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. నగరంలో నాటి పరిస్థితి, నేటి పరిస్థితిని ప్రజలు బేరీజు వేసుకుంటున్నారన్నారు. అభివృద్ధి చేసి, సమస్యలు లేని ప్రాంతాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2024లో వైసిపి గెలవడం చారిత్రక అవసరమని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తమన్న శెట్టి, డా.వీఎస్ ప్రసాద్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్ ను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయించిందని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తెలిపారు. సోమవారం పట్టణంలో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీకి పోటీ చేస్తున్న అభ్యర్థి సీతం రాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహణ కార్యాచరణ పై నాయకులకు పలు సూచనలు చేశారు.ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉన్న 20 రోజుల కాలవ్యవధిలో పార్టీ నాయకులు నియోజకవర్గంలో వివిధ మండల మరియు గ్రామాలలో ఉన్న ఓటర్లను కలిసి అత్యధిక మెజారిటీ సాధించే దిశగా పనిచేయాలన్నారు.2024 లో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు ముందు జరుగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు తమకు కీలకమని పార్టీ శ్రేణులంతా ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, బుడా ప్రతినిధి ఇంటి గోపాలరావు,తూముల భాస్కరరావు,వివిధ మండలాల ఎంపీపీలు,జడ్పిటిసిలు,వైస్ ఎంపీపీలు, పార్టీ అధ్యక్షులు, జేసిఎస్ కన్వీనర్లు,ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సిటియు లో ఏడురోజుల రీసెర్చ్ మెథడాలజీ వరకు షాప్

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రిసెర్చ్ సథరన్ రీజియన్ సెంటర్ ఆధ్వర్యంలో దేశంలో వివిధ విశ్వ విద్యాలయాలనుండి పరిశోధనా విద్యార్థులకొరకు జరుప తలపెట్టిన ఏడురోజుల రీసెర్చ్ మెథడాలజీ కార్యక్రమ ప్రారంభ సమావేశం సోమవారం స్థానిక కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ప్రాంగణం లో జరిగింది దీనికి ముఖ్యఅతిధి గా విచ్చేసిన ఐ సి ఎస్ ఎస్ ఆర్ సథరన్ రీజియన్ డైరెక్టర్ ప్రొ. బి.సుధాకర రెడ్డి మాట్లాడుతూ పరిశోధనా విద్యార్థులు పరిశోధనకు సంభందించిన అన్ని అంశాలపైనా అవగాహన, పట్టును పెంచుకోవాలని తద్వారా సమాజానికి ఉపగపడే పరిశోధనలను చేసేలా తమను తాము మలచుకోవాలని అన్నారు. అనంతరం మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి మరియు యూజీసీ మాజీ సభ్యులు ప్రొఫెసర్ మొహమ్మద్ మియన్ మాట్లాడుతూ పరిశోధ నాంశాలను ఎంపిక చేసికొని సమయంలోనే అత్యంత సామాజిక ఉపయుక్తమైన అంశాలను, నూతన ఆవిష్కరణలను, సామాజిక స్పృహను మేలుకొలిపే విధంగా కిందాలని పిలుపునిచ్చారు. అనంతరం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ. తేజస్వి కట్టిమని మాట్లాడుతూ, విద్యా వ్యవస్థకు సమాజానికి మధ్య అంతరాన్ని తగ్గించాలని, వెనుకబడిన జాతులు, తరగతులకు ఉపయుక్తమైన విధంగా, భారత దేశాన్ని విశ్వ విఫణి లో ముందుకు నిలిపేలా పరిశోధనలు ఉండాలని దానికొరకు పరిశోధకులు ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐసిఎస్ఎస్ ఆర్ కోఆర్డినేటర్ డాక్టర్ జాకబ్ కళ్ళే, సీటియు కోఆర్డినేటర్ డాక్టర్ బొంతు కోటయ్య, ప్రొ.టి శ్రీనివాసన్, ప్రొ. శరత్ చంద్ర బాబు, ప్రొ. మిశ్రా, డా.గంగు నాయుడు మండల, డా. మన్నాల ప్రసాద్, డా.పీ.ఎస్ లత కల్యంపూడి తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరుని ఆలయ అభివృద్ధికి రూ. 4లక్షలతో సహకారమిస్తా...

సి.ఎం.ఆర్ ఎం.డి. మావూరువెంకట రమణ

విశాలాంధ్ర-వంగర : సిఎంఆర్ ఎండి మావూరు వెంకట రమణ సంగమేశ్వర ఆలయ నూతనంగా నిర్మాణ దశలో ఉన్నటు వంటి స్టేజు నిర్మాణం నకు రూ.4లక్షల వరకూ అందజేస్తానని చెప్పారు. సోమవారం సంగమేశ్వరుని దర్శనానికి వచ్చిన ఆయనను కలిసిన విలేఖర్లతో మాట్లాడారు. ప్రస్తుతం సంగమేశ్వరుని వద్దను గల స్టేజ్ నిర్మాణం పునాదులు దశలో నిలిచిపోయిందని ఆయన దృష్టికి తీసుకెల్లగా,ఆయన ఆలయ అభివృద్ధికి 1 లక్ష రూపాయలు, స్టేజి నిర్మాణం పూర్తికి మూడు లక్షల రూపాయలు తన వంతు సహకరించ నున్నట్లు తెలియ జేశారు.అంతేకాకుండా స్టేజి నిర్మాణం నకు సిమెంట్, స్టీలు సమకూర్చనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ముందుగా ఆయన్ను స్థానికి ఎంపిపీ సురేష్ ముఖర్జీ ఆయనకు ఎదురుగా వెళ్లి సాదరంగా స్వాగతం పలికి ఆ సంగమేశ్వరుని దర్శ నానికి తీసుకెళ్లి సంగమేశ్వరుని వద్దనుఆయన సతీసమేతంగా రుద్రాభి షేకంను ప్రధాన అర్చకులు ఎస్.గణపతి చేయించారు.అభిషేకం అనంతరం ఎంపిపీ సురేష్ ముఖర్జీ,ఆయన్ను తీసుకొని,ఆలయం వద్దను నీలానగరం సర్పంచు వావిలపల్లిబాబుపురుషోత్తంరావు నిర్వహిస్తున్న అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎం డి.వెంకటరావు, ఎం పీపి సురేష్ ముఖర్జీ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శివుని వద్దను రుద్రాభిషేకం అనంతరం ఆలయ చైర్మెన్ బోను ఆనందరావు,ఎం.డి వెంకటరావుకు శివాలయం నకు ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేసిందని, అయితే దీనికి 20.లక్షల రుపాయలు డిపాజిట్ చేయాలని ఆలయ చైర్మన్ ఆనందరావు దృష్టి కి తీసుకెళ్లారు. అయితే నాలుగు లక్షల రూపాయలు, సమకూర్చనున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిపీ సురేష్ ముఖర్జీ, ఆలయ చైర్మన్ బోను ఆనందరావు, ఎలకల వాసునాయుడు, పిఎంపి డాక్టర్ ఊగిరి ముత్యాలరావు, వావిలపల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

అరకు పార్లమెంటు ఉపాధ్యక్షుడు గెద్ధ అన్నవరం వెల్లడి

విశాలాంధ్ర-మెంటాడ: తెలుగు దేశం పార్టీ పట్టభద్రుల అభ్యర్థి గా పోటీచేయచున్న వేపాడ చిరంజీవి రావును మొదట ప్రాధాన్యత ఓటు వేసి అఖండ విజయం తో గెలిపించాలని అరకు పార్లమెంటు ఉపాధ్యక్షుడు గెద్ద అన్నవరం కోరారు.సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే రానున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో విజయం తథ్యమని ఆయన కార్యకర్తల ను ఉద్దేజపరిచారు.కార్యక్రమంలో ముసలినాయుడు, కుంటినవలస సర్పంచ్ రమేష్ నాయుడు, రెడ్డి ఆదినారాయణ, రాజగోపాల్, రాయిపిల్లి రవిశంకర్, పి శ్రీనువాసురావు, పెదమేడపల్లి ఎంపిటిసి రెడ్డి ఎర్రి నాయుడు, పార్టీ సీనియర్ నేతలు కె చిన్నం నాయుడు, గెద్ద కాశి, మణిపూరి రామచంద్రుడు, మహంతి సత్యారావ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర-సీతంపేట: గ్రామపంచాయతీలో ఐదేళ్ళుగా విధులు నిర్వహిస్తున్న సవర సుక్కమ్మ తో పాటు మరో నలుగురు పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ గత ఐదు నెలలుగా పంచాయతీ వారు జీతాలు చెల్లింపులు చెయలేదని తమకు జీతాలు చెల్లించే విధంగా న్యాయం చేయాలని వినతిపత్రం ఏపీఓ రోసి రెడ్డికి వినతి పత్రం అందించారు. ఎస్.గణపతి పెదరామ గ్రామంలో సిమెంట్ రహదారి మంజూరుచేయాలని తెలిపారు. ఎన్ సంజీవరావు కొండాడ గ్రామం త్రాగునీరు సమస్య పరిష్కరించాలని వినతి అందించారు. ఎస్ పెంటయ్య రంగం వలస పత్రాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిసిసి డిఎం సంధ్యారాణి, తదితర్లు పాల్గొన్నారు.

మన్యం విలేకరి శ్రీనివాసరావు మృతి... విశాలాంధ్రకు తీరని లోటు

జన్నేటి శ్రీనివాసరావు (ఫైల్)

విశాలాంధ్ర -పార్వతీపురం/గరుగుబిల్లి: విశాలాంధ్ర పార్వతీపురం మండలం గ్రామీణ రిపోర్టర్ జన్నేటి శ్రీనివాసరావు(45) సోమవారం అకాలమృతి చెందారు. పార్వతీపురం ఆయన మృతి మన్యంజిల్లా పత్రికారంగానికి, విశాలాంధ్ర దినపత్రికకు తీరనిలోటని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ప్రజాప్రతినిదులు, శ్రేయోభి లాషులు, వివిధ పార్టీలనేతలు, వివిధ సంఘాల నేతలు విశాలాంధ్ర రెండు జిల్లాల రిపోర్టర్లు అన్నారు. విశాలాంధ్ర రిపోర్టరుగా, పార్వతీపురం సాంకేతిక కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న శ్రీనివాసరావు సోమవారం ఉదయం స్థానిక జిల్లా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం వచ్చిన కొద్దిసేపటికే మరణించారు. ఆయన మరణించారన్న వార్త జిల్లాలో అందరినీ కలచివేసింది. ఆయన గత మూడేళ్ళ నుండి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న అందరితో సన్నిహితంగా ఉంటూ చివరినిమిషం వరకు క్యాన్సర్ వ్యాధి లేనట్లే ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించారు. ఆయన మృతి చెందారన్న సమాచారం తెలిసిన కొద్ది క్షణాల్లో జిల్లాకేంద్రంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆసుపత్రి వద్దకు చేరుకొని పరామర్శ చేశారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే అలజింగి జోగారావు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాగ్దేవిలు కూడా వెంటనే విచ్చేసి శ్రీనివాసరావు మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. శ్రీను చేసిన సేవలను వారు కొనియాడారు. శ్రీను కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు.ప్రభుత్వ సాంకేతిక కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపకులు, సిబ్బంది కూడా ఆసుపత్రి వద్దకు చేరుకొని పరామర్శ చేశారు.అనంతరం ఆయన మృత దేహాన్ని స్వగ్రామం గరుగుబిల్లి మండలం ఉద్దవోలుకు అంబులెన్స్ లో తరలించే చర్యలు చేపట్టారు. ఉద్దవోలు గ్రామానికి శ్రీనివాసరావు మృతదేహాన్ని తరలించా రన్న సమాచారాన్ని తెలుసుకొని మాజీ ఎమ్మెల్సీ, టీడీపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే,పార్వతీపురం టిడిపి నియోజకర్గ ఇంచార్జి బొబ్బిలి చిరంజీవులు, బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, విశాలాంధ్ర బ్రాంచ్ మేనేజర్ రామకృష్ణ,విశాలాంధ్ర స్టాఫ్ రిపోర్టర్ మంతిని రమేష్ లు విచ్చేసి ఆయన మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనసేవలను కొనియాడారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, గరుగుబిల్లి, కొమరాడ, పార్వతీపురం రూరల్ మీడియా ప్రతినిధులు, విశాలాంధ్ర రెండు జిల్లాల రిపోర్టర్లు విచ్చేసి శ్రీనివాస రావు మృతదేహానికి నివాళులర్పించారు. శ్రీనివాసరావుకు నివాళులు అర్పించిన వారిలో టిడిపి నాయకులు గుంట్రెడ్డి రవి కుమార్, కొల్లి తిరుపతిరావు, బడే గౌరు నాయుడు, గొట్టాపు వెంకటనాయుడు, రెడ్డి శ్రీనివాసరావు,ప్రదీప్, జాగాన కార్తీక్ నాయుడు, బోను చంద్రమౌళి, గ్రామ సర్పంచ్ వావిలపల్లి దివాకర్, వైఎస్సార్సీపీ గ్రామ నాయకుడు వావిలపల్లి శ్రీనివాసరావు, ఉద్దవోలు గ్రామపెద్దలు తదితరులున్నారు. సీపీఐ రెండు జిల్లాల నాయకులు పి.కామేశ్వరరావు కె. మన్మథ రావు, ఒమ్మిరమణ,జీవన్, బుడితి అప్పలనాయుడు, ఈవినాయుడు,విశాలాంధ్ర విజయనగరం స్టాఫ్ రిపోర్టర్ ప్రసాద్, తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు, సన్యాసిరావు, సాంబమూర్తి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంఘం అధ్యక్షుడు సామల సింహాచలం, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, చైతన్య నోబెల్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పెదపెంకి శివ ప్రసాద్, జిల్లా ఎన్ జి ఓ అధ్యక్షులు కిషోర్, జిల్లా ఇమ్మ్యూనైజేషన్ అధికారి డాక్టర్ జగన్ మోహన్, 104 వాహన సిబ్బంది దుర్గా ప్రసాద్, ఏపిసిడబ్ల్యుఓ సాంబ మూర్తి, వివిధ వసతిగృహాల సంక్షేమ అధికారులు,పార్వతీపురం మండలంలోని వివిధ గ్రామాలసర్పంచులు, ఎంపీటీసీలు సంతాపం వ్యక్తంచేశారు.విజయనగరం పి ఆర్ ఓ మజ్జి.వాసు, పార్వతీపురం డిపిఆర్ ఓ రమేష్ పార్వతీపురం మండలం లోని అన్ని శాఖల అధికారులు ఆయనకు సంతాపం తెలిపారు. రాష్ట్రటిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, మాజీ ఎమ్మెల్యే, ఎస్సీ కమిషన్ మెంబర్ సవరపు జయమని, టిడిపి నియోజకర్గ నాయకులు గర్భాపు ఉదయభాను, వాడాడ రాములు కూడా ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఇదిలాఉండగా మృతి చెందిన శ్రీనివాసరావు గతంలో వార్త, సాక్షి దినపత్రికలో కూడా విలేకరిగా పనిచేశారు. పార్వతీపురం డివిజన్ లో విశాలాంధ్రను అన్ని మండలాలలో ఏర్పాటు చేయడం లో శ్రీనివాసరావు కృషి ఏనలేనిది. అన్ని పార్టీలు, అన్ని సంఘాల్లో, అందరిలో మంచి వ్యక్తిగా పదిలమైన స్థానాన్ని దక్కించుకున్నాడు. ఆయనకు తల్లి, భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించిన వారంతా శ్రీను కుటుంబాన్ని ఆదు కుంటామని తెలియజేయడం గమనార్హం. జన్నేటి మృతిపట్ల విశాలాంధ్ర రిపోర్టర్లు, డెస్క్ సిబ్బంది అతనితో గల అను బంధాన్ని మననం చేసుకున్నారు.

ఇటీవల సంస్థలో ప్రతిభ కనబర్చినందుకు శ్రీనివాసరావును సన్మానించిన ఎడిషన్ మేనేజర్

విశాలాంధ్ర సహచర మిత్రులతో సరదాగా విశాఖ బీచ్‌లో జన్నేటి...

జన్నేటి పార్థివదేహన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జోగారావు